# సాహిత్య తరంగిణి
## (తెలుగు పరిశోధన పత్రిక)
ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.12-15


# "తిక్కన భారతంలో పునరుక్త పద్యాలు"


**తుళ్ళూరు రవి**
పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం



**ఉపోద్ఘాతం**:తిక్కన తొలిరచన నిర్వచనోత్తర రామాయణం మలిరచన విరాటపర్వం నుండి స్వర్గారోహణపర్వం వరకు పదేను పర్వాలు రాసిన తెలుగు కవిత్రంలో రెండవ వ్యక్తి. నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన తన పితామహుడు మంత్రి భాస్కరుని గుంటూరి విభునిగా సారకవితాభిరామునిగా చెప్పుకున్నాడు.నిర్వచనోత్తరరామాయణం నాటికి నరాంకితం చేశాడు. భారతం సమయానికి "శ్రీయన గౌరినాబరగు చెల్వము చిత్తము .......నిష్టసిద్ధికిన్" పద్యంలో విష్ణురూపాయనమశ్శివాయ అని పలికిన కవి తిక్కన. విక్రమసింహపురిని పరిపాలించిన మనుమసిద్ధి దగ్గర మంత్రిగా, ఆస్థానకవిగా ఉంటూ మామ అని పిలిపించుకున్న సోమయాజి తిక్కన.



**కీలకపదాలు:** భారతం, పునరుక్త ,పద్యాలు, ఆస్థానకవి, నిర్వచనోత్తర.


**"అమలోదాత్తమనీష నే నుభయకావ్య ప్రౌఢిబాటించు శిల్పమునంబార గుడం గళావిదుడ**"నని తిక్కన రామాయణ అవతారికలోతనను గురించి చెప్పుకొన్నాడు. యతి, ప్రాసల స్థానంలో అర్థవంతమైన మాటలను వాడాలని **"జాత్యముగాని నొప్పయిన సంస్కృత మెయ్యెడజొన్న వాక్యసాం ......... కివ్విధ మింపుబెంపదే?.** పద్యంలో చెప్పుకున్నాడు. నిర్వచనోత్తర రామాయణాన్ని కావ్యం, కథ, కృతి, మహాకావ్యం, భారతాన్ని ప్రబంధమండలి, పుణ్యప్రబంధం అని పేర్కొన్నాడు. తెలుగులో మొదటి స్వప్నకథావృత్తం చెప్పిన కవి తిక్కన.

రాజనీతి, యుద్ధతంత్రాలు తెలిసిన వీరులవంశంలో జన్మించినవాడు. మనుమసిద్ధికి కాటమరాజుకు జరిగిన యుద్ధంను తిలకించాడు. మనుమసిద్ధి సేనాధిపతి ఖడ్గతిక్కన, కవి తిక్కన పెద్దతండ్రి సిద్ధన మంత్రి కొడుకు వీరపత్ని ఐన వదిన, వీరమాత ఐన తల్లిని మహావీరుడైన సోదరుని స్వగృహంలో ప్రత్యక్షంగా చూసాడు. యుద్ధభూమి వీర, బీభత్స, భయానక రసప్రధానంగా కన్పించడం విశేషం. "కీలాల జలము పై దేలుచు నవ్వినట్లున్న శిరంబు లొక్కొక్క చోట ఉన్నట్లు వర్ణించాడు. భారతంలో ప్రధాన రసం శాంతం. తిక్కన భారతంలో సందర్భానికి అనుకూలంగా **మ**లుచుకొన్న కవి. తెలుగు సాహిత్యంలో నాటకీయాన్ని పరిచయం చేసిన ద్రౌపది ధర్మరాజుతో ఇట్లనిపలికే **"డప్పి జనించె వ్రేళుల పుటంబులు..... నోర్వనెమ్మెయిన్"** అనే పద్యాల్లో నాటకీయత కన్పిస్తుంది.

- **విరాటపర్వం చతుర్థశ్వాసంలో 234 పద్యం**

**"వచ్చినవాడు ఫల్గునుడవశ్యము గెల్తుమనంగా రాదు రా**
**లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే?**

**సాహిత్య తరంగిణి**
**(తెలుగు పరిశోధన పత్రిక)**
ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.12-15

**హెచ్చగు గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా**
**కిచ్చ దలంచి యొక్కమెయి నిత్తఱి బొందగు చేత యుందగున్"**

కౌరవులపైకి అర్జునుడు దండెత్తి వచ్చేసమయంలో భీష్ముడు పలికే మాటలు ఇప్పుడు మనపైకి దండెత్తి వస్తున్నవాడు అర్జునుడు మనమే జయిస్తాం అని చెప్పలేం రాజ్యలక్ష్మి కొసం పెనుగులాడితే రెండు బలాలూ గెలువలేవు కదా! జయం కలుగవచ్చు, కలుగకపోవచ్చు. ఇప్పుడు మనం చేయగలిగిందల్లా ఏమి వచ్చినా ఓర్చుకొనటమే అంతేకాక ఒక రకంగా సంధి చేసుకోవడం కూడా మంచిపని అవుతుందని భీష్ముడు తెలిపాడు.

- **ఉద్యోగపర్వం తృతీయాశ్వాసంలో 85వ పద్యం పునరుక్తం కావడం విశేషం.**

**"వచ్చినవాడు ఫల్గునుడవశ్యము ...........**
**...................బొందగు చేత యుందగున్."**

విరాటుడుని గోవులను కౌరవులు తోలుకుపోతున్న కౌరవులపైకి అర్జునుడు దండెత్తి వచ్చేసమయంలో భీష్ముడు పలికే మాటలు ఆవులను మరలించుకొని పోవటానికి వచ్చినవాడు అర్జునుడు మనమే జయిస్తాం అని చెప్పలేం రాజ్యలక్ష్మి కొసం పెనుగులాడితే రెండు బలాలూ గెలువలేవు కదా! జయం కలుగవచ్చు, కలుగకపోవచ్చు. ఇప్పుడు మనం చేయగలిగిందల్లా ఏమి వచ్చినా ఓర్చుకొనటమే అంతేకాక ఒక రకంగా సంధి చేసుకోవడం కూడా మంచిపని అవుతుందని భీష్ముడు తెలిపాడు.

ఈ పద్యం తెలుగునాట బాగా ప్రచారంలో ఉన్నది. వచ్చినవాడు ఫల్గునుడు అనడం ఒక లోకోక్తిగా నిలిచింది. ఇక్కడ అంటే వచ్చినవాడు సామాన్యుడు కాడని భావం.భీష్ముడి మనోభావం దీనివలన తెలుస్తుంది. ఈ పరిస్థితిలో సంధి మంచిది అని భీష్ముడి అభిప్రాయం. వచ్చిన ఫల్గునుడు అంటే ఫల్గుని నక్షత్రంలో పుట్టినవాడని అర్థం. అలానే ఒక బెదురింపు జాగ్రత్త అనే సూచన కన్పిస్తుంది. పోరాడితే గెలుస్తామో లేదో అనే సందేహాన్ని వ్యక్తం చేయడంలో భీష్ముడి రాజనీతి తెలుస్తుంది. అందుకే ఏమి వచ్చిన ఓర్చుకోవాలనే హితం కూడా చెప్పాడు. గెలుపు నిశ్చయం కానప్పుడు అన్ని విధాలుగా సంధి మేలనే సలహా ఉంది. ఇన్ని భావాలను మిశ్రమం అయిన ఈ పద్యం తిక్కన ప్రతిభ విశేషజన్యమే. ఈ పద్యం ఎత్తుగడ ఉదాత్తంగా ఉంది.

**వచ్చినవాడు ఫల్గునుడు తిక్కన** ఈ వాక్యం తెలుగువారి జాతీయం అయ్యింది. ఫల్గునుడు అంటే ఫల్గుని నక్షత్రంలో పుట్టినవాడు. పిడుగు పడేటప్పుడు అర్జునః ఫల్గునః అని తలుచుకుంటాం పిడుగుపడి చనిపోతామన్న భయం కలిగే సమయంలో తలుచుకొనే ఈ పేరు పిడుగుపాటు వంటివాడు అనే అర్థంలో తెలుగువారి నోట రూఢికెక్కింది. ఎవడో అసాధ్యుడు వస్తున్నాడనే అర్థంలో తెలుగు వ్యవహారంలో ఆ పలుకుబడికి ఈ పద్యం మూలం. అచ్చమైన తెలుగుపదాలను దేశీయంగ వాడడం. ద్విత్వ చకార ప్రాస పద్యం ఎత్తుగడ ఆశ్చర్యం, ముగింపులో హితబోధ అచ్చుగుద్దినట్లు కనపడుతుంది. పాత్రోచిత సందర్భోచితంగా సంభాషణలకు తిక్కన పెట్టిందిపేరు భీష్ముడు శాంతముడు కానీ మహావీరుడు అతడి దృష్టిలో అర్జునుడు అతిలోక వీరుడు దీనికి కారణం అతడు సాధించిన పాశుపతాస్త్రం, ఇంద్రాది దేవతలిచ్చిన అస్త్రసంపద "విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్" అని లోకోక్తి పండితుడే పండితుడిని అంచన వేయగలడు అనే మాట ఈ పద్యంలో అక్షర సత్యం.

- **విరాటపర్వం చతుర్థాశ్వాసం 236 పద్యం:**

**మనకు బాండురాజు తనయ వర్గమునకు**
**నెట్లు పొందు గలుగు? నేను రాజ్య**

**భాగ మీను సమరభంగి విక్రమ**
**నిరతి బూను టిదియ నిశ్చయంబు.**

మనకు పాండవులకూ సంధి ఏరకంగ ఏర్పడుతుంది? నేను వాళ్ళకు రాజ్యంలో భాగాన్ని ఇవ్వను. అంతేకాక యుద్ధంలో పరాక్రమాన్ని చూపటానికి నిర్ణయించాను. ఇక్కడ దుర్యోధనుడు వక్ర బుద్ధి కన్పిస్తుంది.

**విశేషం:**దుర్యోధనుడు తన నిర్ణయాన్ని కచ్చితంగా భీష్ముడికి చెప్పాడు. భీష్ముడు సంధిని సూచించాడు. దాన్ని దుర్యోధనుడు చిరునవ్వుతో మెత్తగా తోసేశాడు. తిక్కన ఇక్కడ దుర్యోధనుడి వ్యక్తిత్వాన్ని సూచించాడు.

- **ఉద్యోగపర్వం తృతీయాశ్వాసం 87వ పద్యం**

**"మనకు బాండురాజు తనయ వర్గమునకు........**
**............నిరతి బూను టిదియ నిశ్చయంబు."**

మనకు పాండవులకూ పొత్తెలా పొసగుతుంది? నేను రాజ్యంలో వారికి భాగం పంచి ఇవ్వను. పరాక్రమంతో సమరం సాగించి రాజ్యమంతా ఏలుకొనటానికే నిర్ణయించుకున్నాను.

కృష్ణుడు మహావక్త దృష్టాంతాలతో మాట్లడడం తర్కబద్ధ వాక్యవాదికి సహజ గుణం. శ్రీ కృష్ణుడు అర్జునుడితో చెప్పదలచుకున్న అంశం దురోధనుడు సంధికి అంగీకరించడని దానికి తార్కణంగా ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడు పలికిన మాటలు దుర్యోధనుడిచ్చిన సమాధానాన్ని చెప్పాడు. దీనికి రాజ్యం తిరిగి ఇవ్వను యుద్ధంలో జయం నామార్గం అని ప్రకటించుకున్నాడు.

యుద్ధంలో జయపజయాలు అనిశ్చతాలని చెప్పే భీష్ముడి అభిప్రాయం లోకనీతి వాక్యమే యుద్ధం వద్దనేవారు శాంతిని కోరేవారు ఈ అంశాన్ని పెర్కొని సంధి అనిసరణీయం అని చెప్పుతారు. ఉద్యోగపర్వంలో (3.18)ధర్మరాజు కూడా యుద్ధంలో జయమో!, ఓటమో! నిశ్చయం చెప్పలేం యుద్ధంలో ఓడితే మరణం కంటే దుర్భర మనోవేధన పడాలి కాబట్టి సంధి మేలంటారు ధర్మరాజు. ధర్మరాజు, భీష్ముడు ఒకే రకంగా లోకహితంగా, ఆచరణయోగ్యంగా ఆలోచిస్తున్నారని ఇక్కడ స్పష్టం అవుతుంది. ఒక సారి ఇలాంటి యత్నం చేసిన భీష్ముడు విఫలం కాగా ఇప్పుడు ధర్మరాజు సఫలుడౌతాడా? అనే ప్రశ్న శ్రీకృష్ణుడు రేకెత్తించాడు.

ఈ పద్యాల్లో అర్జునుడి పరాక్రమ ధ్వని దానిని ధ్వనింపజేసి కౌరవపాండవుల మధ్య సంధి కుదిరించాలన్న భీష్ముడు శాంతి సంకల్ప ధ్వని. కవిత్రయం ధ్వని ప్రస్థానానికి సంబంధించినవారు తిక్కన రసధ్వని మార్గంలో సాగాడు. శబ్దవాక్య ప్రయోగంలో తిక్కన ఔచిత్య పాలనం చేస్తాడు. శబ్దగుణాల కంటే అర్థగుణాలు ఎక్కువుగా పోషిస్తాడు. ఈ పద్య రచనలో ప్రసాద గుణం ఉంది. బంధ శైథిల్యం అర్థ వైమల్య పోషకంగా నిలవడం ఇందులో విశేషంగా ఉన్నాయి.

తిక్కన భారతంలో రచనలో కొన్ని పద్యాలను సందర్భోచితంగా పునరుక్తం చేశాడు. అట్లాచేసిన పద్యాలలో పై రెండు చెప్పిన పద్యాలు కన్పిస్తున్నాయి. కథలో కీలకపాత్ర పోషించే ఈ పద్యాలు వస్తుగతంగా ప్రాధాన్యంగా కన్పిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు:**

1. ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం (సం.1),మద్రాసు: ఎమెస్కో, 1965.

2. తిక్కన, ఆంధ్రమహాభారతం విరాటపర్వం (సం.6) తిరుపతి:తిరుమల

తిరుపతి దేవస్థానము, 2013.

# సాహిత్య తరంగిణి
## (తెలుగు పరిశోధన పత్రిక)
**ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)**
**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.12-15**



3. తిక్కన, ఆంధ్రమహాభారతం ఉద్యోగపర్వం (సం.7) తిరుపతి: తిరుమల
తిరుపతి దేవస్థానము, 2013.